www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య కె.పద్మరాజు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 | సంచిక : 35 | 29-05-2023 | పుటలు : 4

## ఏపీ గవర్నర్‌ను కలిసిన వీసీ ఆచార్య కె.పద్మరాజు



**26.05.23 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య కె.పద్మరాజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయాల కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం సాయంత్రం గవర్నర్ కార్యాలయంలో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ కు పుష్పగుచ్ఛం అందించి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేస్తానని, విశ్వవిద్యాలయ అభివృద్ధి ప్రణాళికను గవర్నర్ కు వివరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వీసీ ఆచార్య కె.పద్మరాజుకు గవర్నర్ అబ్దుల్ నజీర్ శుభాకాంక్షలను తెలియజేసారు.

## సీఎం జగన్మోహన్ రెడ్డిని కలిసిన వీసీ పద్మరాజు

తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో జరిగిన జగనన్న విద్యాదీవెన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం జగన్మోహనరెడ్డిని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు సభావేదిక పై కలిశారు. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయని అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో నన్నయ వీసీ తో పాటు జె.ఎన్.టి.యు.కె. వీసీ ఆచార్య ప్రసాదరాజు, రాష్ట్ర విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



## అందరి సహకారంతో
# నన్నయను అభివృద్ధి చేస్తాం

**22.05.23 (మీడియాసెల్)**

ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలు మరియు విశ్వవిద్యాలయ సిబ్బంది, అందరి సహకారంతో నన్నయ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేస్తామని వీసీ ఆచార్య కె.పద్మరాజు తెలియజేసారు. సోమవారం యూనివర్సిటీ సెమినార్ హాల్ లో ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎఫిలియేటెడ్ కాలేజెస్ మేనేజ్మెంట్స్ అసోసియేషన్ సభ్యుల, డిగ్రీ & పీ.జీ. కళాశాలల ప్రిన్సిపాల్స్, కరస్పాండెంట్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య కె.పద్మరాజు ను ఆహ్వానించి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు యూనివర్సిటీ ఎఫిలియేటెడ్ కాలేజెస్ అసోసియేషన్ నిర్వహిస్తున్న కార్యక్రమాలను, సమస్యలను వీసీ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే ఎక్కువ అనుబంధ కళాశాలలు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి ఉండటం ఎంతో హర్షనీయమని అన్నారు. ఎక్కువ అనుబంధ కళాశాలలు, ఎక్కువ మంది మేధావులైన అధ్యాపక బృందం, ఎక్కువ మంది విద్యార్థులు నన్నయ విశ్వవిద్యాలయ పరిధిలో ఉండటం ఎక్కువ అభివృద్ధి మార్గాలను అన్వేషించాలన్నారు. అందరూ కలిసి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధి కోసం కృషి చేద్దామని చెప్పారు. నన్నయ విశ్వవిద్యాలయానికి జాతీయ స్థాయిలో మంచి గుర్తింపును తీసుకువచ్చి రూసా నిధులను సమకూర్చి విశ్వవిద్యాలయాన్ని ప్రగతి పథంలోనికి తీసుకువెళ్దామన్నారు. అనుబంధ కళాశాలలు తెలియజేసిన సమస్యలపై సానుకూలంగా స్పందించి వాటిని పరిష్కరిస్తామన్నారు. విశ్వవిద్యాలయంతో పాటు అనుబంధ కళాశాలలకు పరీక్షా పత్రాల చేరవేతను ఆటోమేషన్ చేస్తామన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంతో పాటు జె.ఎన్.టి.యు.కె., ఎన్.ఐ.టి తాడేపల్లిగూడెం, డా.వై.ఎస్.ఆర్.హార్టికల్చర్ యూనివర్సిటీలు క్లస్టర్ యూనివర్సిటీలుగా ఉన్నాయని వాటి సేవలను వినియోగించుకుంటామన్నారు. అనుబంధ కళాశాలలు నాణ్యమైన ఉన్నత విద్యను విద్యార్థులకు అందించాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, సీడీసీ డీన్ ఆచార్య కె.శ్రీరమేష్, అఫిలియేటెడ్ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఎల్.నరసింహారావు, ఉపాధ్యక్షుడు నారాయణ రావు,హాబీబుల్లా, సుగుణారెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



వీసీ ఆచార్య కె.పద్మరాజు ను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేస్తున్న అసోసియేషన్ నాయకులు

# సంపాదకీయం



## గోదావరి సంస్కృతి

విభిన్న భౌగోళిక స్వరూపాల సమాహారం తూర్పుగోదావరి.ఒక ప్రక్క తూర్పు కనుమలు, అరణ్య ప్రాంతం, గోదావరి డెల్టా త్రివేణి సంగమం. కొండలు,అడవులు, నదులతో కూడిన విశాలమైన సముద్రతీరాలు. శాతవాహనుల దగ్గర్నుండి మొగలాయిల వరకు ఎన్నో రాజవంశాలు పరిపాలించిన నేల.అందుకనే ఇది విభిన్న జీవన సంస్కృతి సౌరభాలతో విలసిల్లుతోంది.

ప్రకృతి ప్రసాదించిన అద్భుత వరం నది. నది అంటే కేవలం నీరు మాత్రమే కాదు. నది అంటే ఒక జీవన విధానం.నది నీటి పొరల్లో మానవ వికాస నాగరికత నిక్షిప్తమై ఉంది.నాసికా త్రయంబకం నుంచి తూర్పు ప్రాంతాల్లోకి ప్రవేశించి శాఖోపశాఖలుగా సంగమ స్రవంతిగా గోదావరి ప్రవహించి ఈ జిల్లాలను సస్యశ్యామలం చేస్తూ తిరిగి బంగాళాఖాతంలో కలుస్తోంది.ఈ గౌతమి తీరంలోనే నన్నయ మహాకవి ఆంధ్రమహా భారతాన్ని రచించారు. సినీ దర్శకులు ప్రకృతిని తమ కెమెరాల్లో బంధించి పాపికొండలు,గోదావరి అందాల్ని అద్భుతంగా తెరకెక్కించారు.

పట్టిసం పరమశివుడు, గండి పోచమ్మ, దేవీపట్నం చౌడేశ్వర స్వామి, పేరంటాలపల్లి విశ్వేశ్వరుడు,వేదంలా ఘోషించే గోదావరి తీరాన రాజమహేంద్రిలో మార్కండేయస్వామి,ఇస్కాన్ లో హరేకృష్ణ మహామంత్ర సంకీర్తనోద్యమం ఆధ్యాత్మిక శోభకు తార్కాణాలు. శ్రీనాథుడు వర్ణించిన ముళ్లగూరమ్మ నాటి నగరదేవత.

వీరేశలింగం,వడ్డాది సుబ్బారాయుడు గార్ల పేరిట ఏర్పడిన రెండు గ్రంథాలయాలు ప్రసిద్ధమైన గౌతమి గ్రంథాలయంగా ఏర్పడి పేరొందింది.నేదునూరి గంగాధరం జానపద విజ్ఞాన కృషి, రాళ్ళబండి మ్యూజియం, కందుకూరి స్మృతిచిహ్నాలు, శ్రీపాద, చిలకమర్తి, మధునాపంతుల రచనలు, బీడుభూముల్ని సస్యశ్యామలం చేసిన కాటన్ మ్యూజియం మనకు దర్శనమిస్తాయి.

మట్టిలో మహత్తును,గమ్మత్తును కడియపులంక పూలవనాల్లో చూడొచ్చు. అక్కడ గడ్డి మొక్క కూడా సౌందర్య దృశ్యమే. మారేడుమిల్లిలో విరబూసిన ప్రకృతి జలపాతాల ఆకృతి, ఉప్పాడ జాంధానీ, కాకినాడ కలెక్టరేట్, కోరంగి అభయారణ్యం,యానాం మౌంట్ ఆఫ్ మెర్సీ, రాజ్యాలు అంతరించినా చెక్కుచెదరని రామచంద్రపురం కోట, ఎటు చూసినా కనిపించే కోనసీమ ఆకుపచ్చ తివాచీ.కాసేపు వశిష్ఠ తీరాన దిండి రిసార్ట్స్ లోనో, ఓడలరేవు వైనతేయ నదీపాయల సాగర సంగమంలోనో సేదతీరాల్సిందే.

అయినవిల్లి, ముక్తేశ్వరం, ఆదుర్రు, అప్పనపల్లి, అంతర్వేది, మందపల్లి, కోరుకొండ, తంటికొండ, ర్యాలీ, వాడపల్లి, బిక్కవోలు, మామిడాడ, దక్షారామం, కోటిపల్లి, సామర్లకోట, పెద్దాపురం, సర్పవరం,పిఠాపురం, అన్నవరం, తలుపులమ్మలోవ... ఇవన్నీ ఆధ్యాత్మిక క్షేత్రాలు.

యాత్ర అంటే ప్రయాణం మాత్రమే కాదు. మనలోకి మనం వెళ్లే ప్రవాహం... అంటారు 'యాత్ర' పుస్తకాన్ని తయారుచేసిన

శ్రీ శివన్నారాయణరెడ్డి. ఆ ప్రవాహంలో రుచికరమైన వంటకాలు తాపేశ్వరం కాజా, ఆత్రేయపురం పూతరేకులు, కోటయ్య కాజా, సర్పవరం మామిడి తాండ్ర, అంబాజీపేట పొట్టిక్కలు, కోనసీమ కొబ్బరిబొండాలు, అన్నవరం ప్రసాదం,అమలాపురం సోంపాపిడి, నగరం గరాజీలు... మీకేం కావాలనిపిస్తే అవి. ఇవికాదనుకుంటే పులస పులుసు,ముంత బిర్యాని, బొంగు చికెన్.

సంప్రదాయాల శోభతో జగ్గన్నతోట ప్రభలు,మమతల కోవెల లాంటి మండువా లోగిళ్ళు, అమ్మవారి జాతర్లలో గరగ నృత్యాలు, తెలుగువారి వేదం చింతలూరు ఆయుర్వేదం, విప్లవ జ్యోతి అల్లూరి విగ్రహాలు... వెరసి తూర్పుగోదావరి సప్తస్వరాలై శోభిల్లే స్వర్గధామం! పశ్చిమ గోదావరితో సఖ్యతనొందిన ఆరామం!!



## జగనన్న విద్యాదీవెన - కొవ్వూరు సభలో పాల్గొన్న విద్యార్థులు

**పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్.. క్రమం తప్పకుండా ఏ త్రైమాసికం ఫీజు ఆ త్రైమాసికం అయిన వెంటనే చెల్లింపు. జనవరి-మార్చి 2023 త్రైమాసికానికి 9.95 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తూ రూ.703 కోట్లను తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో బటన్ నొక్కి నేరుగా విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేసిన సీఎం శ్రీ వైయస్.జగన్.**

**ఈ సందర్భంగా జరిగిన బహిరంగసభలో మాట్లాడిన సీఎం.**

**సీఎం శ్రీ వైయస్.జగన్ ఏమన్నారంటే...**

మే నెలలో మండే ఎండలోనూ, చెక్కుచెదరని చిరునవ్వులతో, చిక్కటి ఆప్యాయతల మధ్య ఇంతటి ప్రేమానురాగాలు చూపిస్తున్న ప్రతి అక్కకూ, చెల్లెమ్మకూ, ప్రతి అవ్వకూ, తాతకూ, ప్రతి స్నేహితుడికీ, సోదరుడికీ హృదయపూర్వక కృతజ్ఞతలు.

**మరో మంచి కార్యక్రమానికి శ్రీకారం...**

ఈ రోజు దేవుడి దయ మీ అందరి చల్లని దీవెనలతో కొవ్వూరులో మరో మంచి కార్యక్రమం జరుపుకుంటున్నాం. దాదాపుగా 9.95 లక్షల మంది పిల్లలకు వారి పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బు దాదాపు రూ.703 కోట్లను 8,91,180 మంది వారి తల్లుల ఖాతాల్లోకి నేరుగా జమ చేస్తున్నాం.

**పేదరికం పోవాలంటే గొప్ప అస్త్రం - చదువు.**

మన సమాజంలో తరతరాలుగా పేదరికంలో మగ్గిపోతున్న కుటుంబాలు చాలా ఉన్నాయి. తరతరాలుగా పేదరికంతో మగ్గిపోతున్న వెనుకబడిన కులాల కుటుంబాల తలరాతలు మారాలని, ఆ కుటుంబాలు పేదరికం నుంచి బయటకు రావాలని, ఆ ప్రతి కుటుంబం నుంచి ఒక ఇంజనీర్, ఒక డాక్టర్, ఒక కలెక్టర్ వంటి పెద్ద చదువులతో పిల్లలు బయటకు రావాలని, మంచి ఉద్యోగాలు చేసి పేదరికం సంకెళ్లు తెంచుకుని దాన్నుంచి బయటపడాలని.. దానికి చదువు ఒక్కటే మార్గమని ఈ నాలుగేళ్ల మన పాలనలో మీ వాడిగా అడుగులు వేశాను. పేదరికంలో మగ్గిపోతున్న నా ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీలు, నా నిరుపేద వర్గాలు సామాజికంగానూ, ఆర్థికంగాను గట్టిగా నిలబడాలంటే.. వారి పట్ల ఉన్న వివక్ష సంకెళ్లను తెంచుకోవాలంటే అందుకు చదువు ఒక్కటే మార్గమని గతంలో చాలామంది గొప్పవాళ్ల చెప్పారు.

బాబా సాహెబ్ అంబేద్కర్, సావిత్రీ బాయి పూలే, మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ ఇలా ఏ గొప్ప వ్యక్తిని తీసుకున్నా వారి నోటిలోంచి వచ్చే మాట. వివక్ష, పోవాలన్నా, పేదరికం పోవాలన్నా చదువు అనేది గొప్ప అస్త్రం అన్న మాట వినిపిస్తుంది.

**చదువుల విప్లవం దిశగా...**

ఈ రోజు అలాంటి చదువులు విప్లవం దిశగా మార్పులు వచ్చేటట్టుగా మన రాష్ట్రంలో గత నాలుగేళ్లుగా అడుగులు వేశాం. పెద్ద చదువులు పేదలందరికీ హక్కుగా అందాలని, ప్రతి కుటుంబంలోనూ ఆ పెద్ద చదువులు దక్కాలని జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన అనే కార్యక్రమాలు అమలు చేస్తున్నాం.

పెద్ద చదువులు చదువుకుంటున్న పిల్లలు కట్టవలిసిన పూర్తి ఫీజులను వాళ్ల తల్లుల ఖాతాల్లోకి ప్రతి త్రైమాసికం అయిపోయిన వెంటనే జమ చేసే కార్యక్రమం జరుగుతుంది. ఈరోజు కొవ్వూరులో హోంమినిష్టర్, నా చెల్లెమ్మ వనిత నియోజకవర్గం నుంచి ఈ కార్యక్రమం చేయడం సంతోషం.

**ఈ త్రైమాసికానికి సంబంధించి రూ.703 కోట్లు...**

ఈ ఏడాది జనవరి–ఫిబ్రవరి – మార్చి త్రైమాసికానికి సంబంధించి 9.95 లక్షల మంది పిల్లలకు పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్ డబ్బులు రూ.703 కోట్లను 8.91 లక్షల మంది తల్లుల ఖాతాల్లోకి ఇప్పుడు డబ్బు జమచేస్తున్నాం. లంచాలు లేకుండా, వివక్ష లేకుండా నేరుగా తల్లుల ఖాతాల్లోకి జమచేస్తున్నాం.

**జగనన్న వసతి దీవెన, విద్యాదీవెన కోసమే రూ.14,912 కోట్లు ఖర్చు**

ఈ రోజు జమ చేస్తున్న రూ.703 కోట్లు కలుపుకుంటే ఈ ఒక్క జగనన్న విద్యాదీవెన పథకానికే ఏకంగా రూ.10,636 కోట్లు ఇచ్చాం. జగనన్న విద్యాదీవెన వల్ల 26.98 లక్షల మంది ప్రయోజనం పొందారు. పిల్లలు వందశాతం ఫీజులు మాత్రమే ఇస్తే సరిపోదు, వారి బోర్డింగ్, లాడ్జింగ్ ఫీజుల చెల్లించడం కోసం ఇబ్బంది పడే పరిస్థితులు రాకూడదని, వాటి కోసం చదువు ఆగిపోయే పరిస్థితులు రాకూడదని జగనన్న వసతి దీవెన అనే కార్యక్రమం ద్వారా ఆ బోర్డింగ్ ఫీజులను కూడా ప్రభుత్వమే చెల్లిస్తోంది. ఐటీఐ చదువుతున్న పిల్లలకు రూ.10వేలు, పాలిటెక్నిక్ పిల్లలకు రూ.15వేలు, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ చదువుతున్న పిల్లలకు రూ.20వేలు ప్రతి ఏటా వసతి దీవెన కింద రెండుమార్లు తల్లుల ఖాతాల్లోకి జమచేస్తున్నాం. దీన్ని అక్షరాల 25.17 లక్షల మందికిపైగా వర్తింపుచేస్తున్నాం.నాలుగేళ్లలో కేవలం ఒక్క ఈ పథకానికే రూ.4,275.76 ఖర్చుచేశాం. పిల్లలు బాగా చదవాలని వారి ఉన్నత విద్య కోసం జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యాదీవెన అనే రెండే రెండుపథకాలు కోసం రూ.14,912 కోట్లు ఖర్చు చేశాం.

ఈ డబ్బులన్నీ నేరుగా నా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి వెళు తున్నాయి. ఈ డబ్బులు అందుకున్న తర్వాత తల్లులు వారం పదిరోజుల తర్వాత కాలేజీలకు వెళ్లి... అక్కడ వసతులన్నీ చూసి, పిల్లలు ఎలా చదువుతున్నారని విచారణ చేసి, వారికి బాసటగా ఫీజులు కట్టే కార్యక్రమం తల్లులకే అప్పగించాం.

**ఫీజులు చెల్లించే ప్రభుత్వం**

చదువుకుంటున్న పిల్లల ఫీజులు ఎంతుంటే అంతా మన ప్రభుత్వం చెల్లిస్తుంది. ఒక ఇంజనీరింగ్ తమ్ముడు వచ్చి మాట్లాడుతూ అన్నాడు.. తన ఇంజనీరింగ్ ఫీజు రూ.63వేలు అయితే కేవలం రూ.35వేలు కూడా సక్రమంగా ఇవ్వని పరిస్థితి అయితే ఆ పిల్లవాడు చదువులు మానేయక ఏమవుతాడు అన్న పరిస్థితి ఆలోచిస్తేనే ఒక్కోసారి భయమవుతుంది.

**ఫీజులు ఎంతైనా మీ అన్న చదివిస్తాడు...**

అందుకే మన పిల్లలందరికీ మంచి జరగాలని.. ఎంత ఫీజులైనా రూ.60వేలు, రూ.70 వేలు, రూ.1లక్ష, రూ.1.20 లక్షలైనా ఎంత ఫీజులైనా ఫర్వాలేదు.. మీరు చదవండి మీ జగనన్న చదివిస్తాడు. ప్రతి అక్కకూ చెబుతున్నాను మీ పిల్లలకు మంచి మేనమామగా ఎప్పుడూ తోడుగా ఉంటాను. ఎంత మంది పిల్లలుంటే అంతమందిని చదవించండి. అన్ని రకాలుగా ఆ పిల్లలకు తోడుగా ఉంటాను.

**చదువుల మీద ఖర్చు%--% మానవవనరుల పెట్టుబడి.**

పిల్లల చదువులు మీద మనం చేస్తున్న ఖర్చు భావితరాల పిల్లల తలరాతలు మార్చేందుకు మేం పెట్టే ఖర్చు.. మానవ వనరులమీద పెడుతున్న పెట్టుబడులు అని ఈ జ్ఞానం లేనివారికి చెప్తున్నాను. ఈ రోజు మనం ఒక విత్తనం విత్తుతున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి విద్యార్థి మంచి ఇంజనీరింగ్, డాక్టర్ వంటి పెద్ద డిగ్రీలతో బయటకు వస్తే... భావితరానికి స్కిల్డ్ మ్యాన్ పవర్‌కు కేరాఫ్ అడ్రస్సుగా ఆంధ్రరాష్ట్రం నిలుస్తుంది. ఇలాంటి స్కిల్డ్ మ్యాన్ పవర్ బయటకు వస్తే రాబోయే రోజుల్లో రాష్ట్రానికి దశ, దిశ ఆంధ్రప్రదేశ్ చూపిస్తోంది

**నర్సరీ నుంచి పీజీ వరకూ విప్లవాత్మక మార్పులు..**

ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో నర్సరీ నుంచి, ఉన్నత విద్యవరకూ విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు నాలుగేళ్లలో అడుగులు పడ్డాయి. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. అందులో చదువులు

మిగిలినది 3లో

# జగనన్న విద్యాదీవెన - కొవ్వూరు సభలో పాల్గొన్న విద్యార్థులు

.కూడా మారుతున్నాయి. ప్రభుత్వ బడుల్లో సీబీఎస్ఈ ఇంగ్లిషు మీడియం చదువులు వచ్చాయి. బై లింగువల్ టెక్స్ట్‌బుక్స్ వచ్చాయి. ఒక పేజీ ఇంగ్లిషు పక్కన మరో పేజీలో తెలుగు ఉంటుంది. మనం తీసుకువస్తున్న గొప్ప మార్పులకు నిదర్శనం ఇది.

**మెనూలో మార్పులు...**

సంపూర్ణ పోషణం, రోజుకోమెనూతో గోరుముద్ద పథకాలు వీటి ద్వారా అంగన్‌వాడీల స్వరూపం కూడా మారుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు పౌష్టికాహారం ఇచ్చే విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. ఈ విషయంలో అక్షరాల ఒక్కో పథకానికి రూ. 2వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం.

**పిల్లలకు ట్యాబులిచ్చిన ఏకైక ప్రభుత్వం...**

విద్యాకానుక ద్వారా స్కూళ్లు తెరిచే సమయానికి కిట్లను అందిస్తున్నాం. స్కూళ్లు తెరిచేనాటికి వారికి అందేటట్టుగా చేయడానికి ప్రత్యేక ధ్యాస పెట్టాం. పిల్లల చదువులను ప్రోత్సహించేందుకు మనం ఇస్తున్న అమ్మఒడి పథకం దేశంలో మరే రాష్ట్రంలోనూ లేదు. అది కేవలం మన ప్రభుత్వంలోనే ఉంది. ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న ప్రతి పిల్లాడికి మంచి బోధన అందించడంపై దృష్టిపెట్టాం. ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న ప్రతి పేదపిల్లవాడిలో స్పష్టమైన మార్పు కనిపించేలా.. సబ్జెక్టు టీచర్ల కాన్సెప్టు తీసుకు వచ్చాం. ప్రతి సబ్జెక్టుకు టీచర్ ఉండేలా అడుగులు వేశాం. పిల్లలకు ఇంటికి వెళ్లిన తర్వాత ట్యూటర్ ఉండాలన్న తాపత్రయంతో బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్స్ ఇచ్చాం. ఆఫ్‌లైన్‌లో పనిచేసే విధంగా ట్యాబులు ఇచ్చాం. 8వతరగతిలోకిప్రవేశించిన ప్రతి విద్యార్థికి ట్యాబులు ఇచ్చిన ఘనత మన ప్రభుత్వానిదే.

**30వేలకుపైగా డిజిటల్ క్లాస్ రూమ్‌లు..**

45 వేల ప్రభుత్వ స్కూళ్లలో మార్పు ఏ స్థాయిలో జరుగుతుందంటే.. నాడు - నేడు పూర్తిచేసుకున్న మొదటి దఫా 15,750 స్కూళ్లలో ఈ జూన్ 12వ తేదీలోగా 6 నుంచి పై తరగుతులు అన్నింటికీ డిజిటల్ క్లాస్‌రూమ్స్ ఏర్పాటు చేస్తున్నాం. మొత్తం 30,230 తరగతిగదుల్లో ఐఎఫ్‌పీ ప్యానెల్స్‌ద్వారా డిజిటల్ బోధన తీసుకువస్తున్న ప్రభుత్వం మనదే. ఈ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ఏర్పాటు పూర్తైతే... ఆ తర్వాత ప్రభుత్వ పాఠశాలలతో ప్రైవేటు స్కూల్స్ పోటీపడే పరిస్థితి వస్తుంది.

**సత్ఫలితాల దిశగా....**

మనం తీసుకువస్తున్న మార్పులన్నీ సత్ఫలితాలనిస్తున్నాయి. 2018%--%19 అంటే గత ప్రభుత్వం చివరి ఏడాదిలో ప్రభుత్వ స్కూళ్లలో చదివే పిల్లలు 37లక్షలు ఉంటే..ఈ రోజు ఆ సంఖ్య 40 లక్షలు దాటింది. ఏ స్థాయిలో మనం సౌకర్యాలు కల్పిస్తున్నామో అన్నదానికి ఇది నిదర్శనం. మనం తీసుకున్న చర్యల వల్ల ప్రభుత్వ స్కూళ్లమీద నమ్మకం కలిగింది. డ్రాప్ అవుట్స్ గణనీయంగా తగ్గాయి. 12వ తరగతి తర్వాత డిగ్రీల్లో చేరకుండా చదువులు ఆపేసిన పిల్లలు 2018-19లో 81,813 ఉంటే ఈ నాలుగేళ్లలో మీ ప్రభుత్వంలో ఈ సంఖ్య 2022-23 నాటికి 22,387కు తగ్గించగలిగాం. ఈ సంఖ్యను ఇంకా తగ్గించడానికి తగిన అడుగులు వేస్తున్నాం.

**ఉన్నత విద్యలోనూ సమూల మార్పులు...**

2018-19లో ఇంజినీరింగ్ చదివేవాళ్లు 87వేలు మంది అయితే ఈ ప్రభుత్వంలో 2022-23లో 1.20 లక్షలమంది చదువుతున్నారు. దాదాపు 50శాతం వృద్ధి ఉంది. ఉన్నత విద్యలో పాఠ్యప్రణాళికను మార్చాం. జాబ్ ఓరియంటెడ్‌గా తీర్చిదిద్దాం. కరిక్యులమ్‌లో మార్పులు తీసుకువస్తూ.. 25 మార్కెట్ ఓరియెంటెడ్, 67 బిజినెస్ ఒకేషనల్ కోర్సులు ప్రవేశపెట్టాం.




**దిగ్గజ సంస్థలతో ఒప్పందాలు...**

దేశంలో తొలిసారిగా నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీని ప్రవేశపెట్టాం. పిల్లల నైపుణ్యం పెంచడానికి మొట్టమొదటిసారిగా ఆన్లైన్ కోర్సులు ఇప్పిస్తున్నాం. స్కిల్ ఓరియెంటెడ్‌గా మన పిల్లలు అభివృద్ధి చెందాలన్న ఉద్దేశ్యంతో పలు సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటున్నాం. మైక్రోసాఫ్ట్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. వారిచేత కోర్సులు చెప్పించి.. సర్టిఫికెట్లు కూడా ఇప్పించి మన పిల్లలకు మెరుగైన ఉద్యోగాలు వచ్చే విధంగా అడుగులు వేయిస్తున్నాం. అమెజాన్ వెబ్‌సర్వీస్, సేల్స్‌ఫోర్స్ వంటి అనేక సంస్థలు కూడా రాష్ట్రప్రభుత్వంతో భాగస్వామ్యం అయ్యాయి.

**జగనన్న విదేశీ దీవెన...**

జగనన్న విదేశీ దీవెన ద్వారా ప్రపంచంలోనే టాప్ 50 కాలేజీల్లో 21 ఫ్యాకల్టీలో, 350 ప్రపంచస్థాయి కాలేజీల్లో సీటు తెచ్చుకున్న పిల్లలకు రూ. 1.25 కోట్ల వరకూ కూడా పూర్తిగా ఫీజులు మన ప్రభుత్వం కడుతుంది.

**ప్రతిభ చూపండి.. తోడుగా నేనుంటా..**

సత్యానాదెళ్లలా.. మన రాష్ట్రంలో ప్రతి కుటుంబం నుంచి రావాలి. ప్రతి కుటుంబం నుంచి కూడా సత్యనాదెళ్లలు రావాలని అడుగులు వేస్తున్నాం. రూ. 1.25 కోట్లు ఫీజులు కట్టాల్సి వస్తే.. స్టాన్‌ఫర్ట్, ఎంఐటీ, ఆక్స్‌ఫర్డ్‌లో సీటు వచ్చినా ఆ ఫీజు కట్టలేక, చదువుకోలేకపోతున్నవారందికీ చెప్తున్నా... ప్రతిభ మీరు చూపించండి.. మీ ప్రతిభకు తోడుగా నేనున్నాను. చదువులు ప్రోత్సహించేందుకు, ప్రతి ఇంటా చదువులు ఉండేందుకు.. షాదీతోఫా, కళ్యాణమస్తు లాంటి పథకాలను కూడా చదువుతోనే ముడిపెడుతున్నాం. ప్రతి ఇంట్లో చదువు ఉండేటట్టు ప్రోత్సహిస్తున్నాం.

**ఒక్కసారి ఆలోచన చేయండి...**

విమర్శించే ప్రతిపక్షాలంతా ఆలోచన చేయండి? విమర్శించే మీడియాను కూడా అడుగుతున్నాను ? మన పిల్లలు పేదరికం నుంచి బయటకు రావాలంటే చదువొక్కటే మార్గమని మనసా, వాచా, కర్మణా నమ్మిన ప్రభుత్వం మనది. వాళ్ల తరపున మన ప్రభుత్వం ఉందని వీళ్లందరికీ తెలియజేస్తున్నాను. విమర్శించేవాళ్లంతా ఒక్క ఆలోచన చేయండి ? ఇంతకుముందు ఎప్పుడైనా ఇలా జరిగినదా? లంచాలు ఇవ్వకుండా, వివక్ష లేకుండా నేరుగా తల్లుల ఖాతాల్లోకి వచ్చే పరిస్థితి గతంలో ఉండేదా?అమ్మ ఒడి నుంచి చూస్తే.. విద్యాదీవెన, వసతి దీవెన, ఆసరా, చేయూత లాంటి పథకాలు నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి ఎలా వస్తున్నాయి?అప్పుడూ ఇప్పుడూ ప్రభుత్వం ఉంది. అప్పుడు ఇదే బడ్జెట్.. ఇప్పుడు కూడా అదే బడ్జెట్.

**అప్పుల గ్రోత్ రేటు చూస్తే.. అప్పటితో చూస్తే.. ఇప్పుడే తక్కువ.**

కేవలం ముఖ్యమంత్రి మాత్రమే మారాడు. సీఎం మారడంతో నా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి రూ. 2.10 లక్షల కోట్లు నేరుగా బదిలీ చేశాం. ఈ డీబీటీ ఒక్కటే కాకుండా ఇంటి స్థలాలు చూసుకుంటే.. 30 లక్షల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశాం. దీని విలువ చూస్తే... ఒక్కో ఇంటి స్థలం విలువ కనీసం రూ. 2.50 లక్షలు వేసుకున్నా మరో రూ. 75 వేల కోట్లు అవుతుంది. ఇలా నాన్ డీబీటీ పథకాలు కూడా కలుపుకుంటే నాలుగేళ్లలో రూ. 3 లక్షల కోట్లు అక్కచెల్లెమ్మల కుటుంబాలకు మేలు జరిగింది. ఆలోచన చేయండి.

**గతంలో ఎందుకు జరగలేదు? ఇప్పుడు మాత్రమే ఎందుకు జరుగుతున్నాయి?**

కారణం గతంలో ఏ ఒక్కరూ పేదవాడి గురించి ఆలోచన చేయలేదు.

పేదవాడు ఎలా బ్రతుకుతున్నాడు. వాడికి ఏం చేయాలి ? పేదరికం పోవాలంటే.. ఏంచేయాలన్న ఆలోచన చేయలేదు.

**కాసేపటి క్రితం..**

నా చెల్లి హెూంమంత్రి వనిత మాట్లాడుతూ.. నియోజవర్గ అభివృద్ధికి కొన్ని ప్రతిపాదనలు చెప్పింది. కొవ్వూరు డిగ్రీ కాలేజీ మంజూరు అయింది, సిబ్బంది మంజూరు అయ్యారు. భవనాల కోసం రూ. 30 కోట్లు అడిగింది. దాన్ని మంజూరు చేస్తున్నాను. మూడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల మరమ్మతులు, మూడు అంబేద్కర్ భవనాలు, ఎస్సీ కమ్యూనిటీ హాల్, కాపు భవనం, షాధీ ఖానాతో పాటు కొవ్వాడ కెనాల్ మీద కల్వర్టు కోసం కూడా అడిగింది. వీటన్నింటినీ మంజూరు చేస్తున్నాను. మీ అందరికీ మంచి జరగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

జిల్లా ఇన్చార్జి మంత్రి, సమాచార పౌర సంబంధాలు, బీసీ సంక్షేమం, సినిమా ఆటోగ్రఫీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ,రాష్ట్ర హెూం శాఖ తానేటి వనిత, శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేంరాజు, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మెరుగు నాగార్జున, ఉపముఖ్యమంత్రి,దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జి. జయలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకురాలు విజయ్ కృష్ణన్, శాసనమండలి సభ్యులు పావూరు శ్రీనివాసరావు, మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, పార్లమెంటు సభ్యులు మిథున్ రెడ్డి, ఎంపి మార్గాని భరత్ రామ్, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోష్, శాసనసభ్యులు జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావు, జి శ్రీనివాస్ నాయుడు, సత్తి సూర్యనారాయణ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి, వేణుగోపాలరావు, స్మార్ట్ సిటీ చైర్మన్ చందన నాగేశ్వర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎస్ మణికుమారి, డిసిసిబి చైర్మన్ ఆకుల వీర్రాజు, రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిల రెడ్డి, కొవ్వూరు పురపాలక చైర్ పర్సన్ జిల్లా కలెక్టర్ డా. కే. మాధవీలత, జాయింట్ కలెక్టర్ ఎన్ తేజ్ భరత్, మున్సిపల్ కమిషనర్ కే దినేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ సి..యశ్వంత్ కుమార్ రెడ్డి, ఆర్డీవోలు ఏ చరిత్ర వర్షిని, ఎస్ మల్లిబాబు, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, లబ్దిదారులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న నీకు వందనం



జగన్ అన్న, మా కుటుంబంలో మేం ఐదుగురు సభ్యులం. మా నాన్న డ్రైవర్, నా తల్లి గృహిణి, మరియు నాకు ఇద్దరు తోబుట్టువులు ఉన్నారు, మా అన్నయ్య గ్రాడ్యుయేషన్ పూర్తి చేసాడు మరియు నా చెల్లెలు బ్యాచిలర్ డిగ్రీలో చివరి సంవత్సరం చదువుతున్నారు. మా నాన్నగారికి డ్రైవర్‌గా మా ముగ్గురిని చదివించడం చాలా కష్టమైన పని, కానీ మేము జగనన్న విద్యా దీవెన మరియు జగనన్న వసతి దీవెన అందుకుంటున్నాం. విద్యా పరంగా మన జగనన్న ఎన్నో మార్పులు తీసుకువచ్చారు అన్ని విద్యా వ్యవస్థలు మారాయి. జగనన్న ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారు. వాటి ద్వారా ప్రతి ఒక్కరికి లబ్ది చేకూరుతుందన్నారు. ప్రయివేటు కాలేజీకి దీటుగా ప్రతి ప్రభుత్వ కాలేజీకి నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేసే జగనన్న విద్యా దీవెన పథకాన్ని అమలు చేశారు. విద్యార్థుల పరిస్థితి నిమిత్తం 20,000 రూపాయలు జగనన్న వసతి దీవెన పథకంతో నేరుగా తల్లి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. ప్రతి విద్యార్థి జగనన్న పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నారు. విద్యార్థులందరి తరపున ధన్యవాదాలు. 2019 - 20 నుండి మూడు సంవత్సరాల వ్యవధిలో అన్ని ప్రభుత్వ సంస్థలకు అద్భుతమైన మార్పులను తీసుకువచ్చి, పునర్జన్మను అందించిన నాడు-నేడు పథకం ఎంతో ప్రత్యేకమైనది. ఆరోగ్యమే ఐశ్వర్యం అని మీరు విశ్వసించారు, జగనన్న ఈ నినాదాన్ని కొనసాగించి, మధ్యాహ్న భోజనం మెనూని సవరించి నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించే జగనన్న గోరుముద్ద పథకం అమలు చేశారు.జగన్నాథ మీరు సిఎం అయ్యాక జగనన్న వసతి దీవెన అమ్మవాడి, నాడు-నేడు లాంటి పథకాలతో ఎన్నో మార్పులు చూసాం. జగనన్న మీ పథకాల వల్ల నేను, నా కుటుంబం లబ్ధి పొందుతున్నాం. ప్రతి నెలలో సూర్యోదయానికి ముందు మా అమ్మమ్మ తన పింఛను 2750/- గ్రామ - వార్డు వాలంటీర్ వ్యవస్థ ద్వారా అందుతుంది. మా సొంతింటి కల నెరవేరబోతుంది. జగనన్నా మీ ప్రభుత్వంలో నాకు, నా తోబుట్టువులకు ఘనత దక్కింది. 1,50,000/- మీ పథకాల కారణంగా మేము ముగ్గురం గ్రాడ్యుయేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసాము. ప్రజా సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిన జగనన్న నీకు వందనం.

**- తాహేరా బేగం**
**ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ**
**ఆదికవి నన్నయ యూనివర్సిటీ**
**(జగనన్న విద్యాదీవెన కార్యక్రమంలో బేగంను అభినందించిన వీసీ)**

## మంచిమాట



**యౌవనోత్సాహం పరవళ్ళు తొక్కుతున్నప్పుడే మీ భవిష్యత్తును నిర్దేశించుకోండి. ఒక ఆదర్శాన్ని స్వీకరించి, దాన్నే మీ జీవితంగా చేసుకోండి. ఇతర విషయాలను వదిలి పెట్టండి.**

**You are spoiling your lives in vain . Either take up one idea , clear the deck , and to it dedicate the life ; or be contented and practical.**

**- స్వామి వివేకానంద**



## విద్యాశాఖ మంత్రి, అధికారులను కలిసిన వీసీ పద్మరాజు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య కె.పద్మరాజు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్నందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఫర్ హయర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, వైస్-చైర్మన్ ఆచార్య కె. రామమోహనరావు, సెక్రటరీ ఆచార్య వై. నజీర్ అహ్మద్ లను కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసారు.







# నిరంతర పరిశోధకుడు-బహుముఖ ప్రజ్ఞాశాలి ఆచార్య అల్లం అప్పారావు

## ప్రతిభావాణి

స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లాలోని ఉండి. నాన్న గురుమూర్తి, అమ్మ లక్ష్మీబాయి. నాన్న ఉపాధి కోసం విజయనగరం వచ్చి, రాజుల సంస్థానంలో దివాన్‌గా చేరారు. ఆ తరువాత సంస్థానాలన్నీ ప్రభుత్వంలో విలీనం కావడంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం ఇచ్చారు. ఎస్.కోట, ఎల్.కోట, కొత్తవలసల్లో చదువు. 1964 లో పీయూసీ, 1967లో బీఎస్సీ .

తొలి ఉద్యోగం పేరే 'కంప్యూటర్'. గణాంక వివరాలన్నింటిని సమీకరించే పని. హిందూస్థాన్ పాలిమర్స్‌లో 'కలర్ కెమిస్ట్' ఉద్యోగం నెల రోజులే చేశారు. దాన్ని వదిలి ఏయూలో పరిశోధకులకు సహాయకునిగా వుండే 'కంప్యూటర్ ఆపరేటర్'గా జాయిన్ అయ్యారు. బుల్లయ్య, రామచంద్రరావు మాస్టార్లు ఇద్దరూ కలిసి 1970-71 మధ్యకాలం లో దక్షిణ భారతదేశంలోనే తొలి సైంటిఫిక్ కంప్యూటర్ వ్యవస్థ ఐబీఎం-1130 ను ఏయూ లో నెలకొల్పారు. దాని నిర్వహణలో ప్రముఖ పాత్ర పోషించారు. ఎంఏ (ఎకనామిక్స్) చేశారు. 1976-78లో ఎల్రక్టికల్ ఇంజనీరింగ్ చేశాడు. పీహెచ్‌డీ పూర్తిచేసి 1981లో థీసిస్ సమర్పిస్తే 1984 లో



డిగ్రీ ఇచ్చారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో లెక్చరర్‌గా, రీడర్‌గా చేయకుండా నేరుగా ప్రొఫెసర్ అయిన తొలి వ్యక్తి. కంప్యూటర్స్ విభాగాధిపతిగా, చీఫ్ వార్డెన్‌గా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ గా అనేక బాధ్యతలు నిర్వహించారు. ఆయన దగ్గర ఇప్పటివరకూ 15 మంది పీహెచ్‌డీలు చేసి పట్టాలు పొందారు. ఎమ్మెస్సీ చేసిన వారికి ఎంటెక్ చేసే అవకాశం కల్పించారు. ఎన్టీఆర్ యూనివర్సిటీతో కలిసి 'క్లినికల్ రీసెర్చి'పై అధ్యయనం ప్రారంభించారు. మధుమేహ రోగం మూలాలు తెలుసుకోవడానికి అమెరికాకు చెందిన వి.ఎన్.దాస్, విశాఖలోని డాక్టర్ శ్రీధర్‌లతో కలసి డయాబెటీస్ జెనిటిక్స్‌పై 'బయో ఇన్‌ఫర్మేటిక్స్' అంశంపై పదేళ్లుగా పరిశోధనలు చేస్తున్నారు. ప్రొఫెసర్ చందు సుబ్బారావుతో కలసి 'ఐ.టి. కల్చర్' అనే పుస్తకం రాశారు.

నవంబర్ 2018లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆయనను గౌరవ డాక్టరేటుతో సత్కరించింది. జేఎన్టీయూ కాకినాడ వైస్ ఛాన్సలర్ గా సేవలందిస్తూ, ఆదికవి నన్నయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ గా అదనపు బాధ్యతను నిర్వర్తించారు.

- డా.మోక్షరాయలు



## టేకి కుటుంబాన్ని పరామర్శించిన ఉన్నత విద్యా మండలి చైర్మన్

ఇటీవల గుండెపోటుతో మరణించిన నన్నయ విశ్వవిద్యాలయ ఆచార్యులు ఎస్.టేకి కుటుంబాన్ని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ఆచార్య కె. హేమచంద్రారెడ్డి పరామర్శించారు. రాజమండ్రిలోని టేకి నివాసానికి వెళ్లి, నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని తెలియజేశారు. చైర్మన్ ఆచార్య కె. హేమచంద్రారెడ్డితో పాటు నన్నయ విసి ఆచార్య కె పద్మరాజు, జేఎన్టీయూకే విసి ఆచార్య ప్రసాదరాజు, రిజిస్ట్రార్ ఆచార్య టి అశోక్, అధ్యాపకులు పాల్గొన్నారు.



ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in